# పాక్‌కు నలుగురు తరలింపు

## పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ కేంద్రంగా పలువురి ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. జీహెచ్ఎంసీతోపాటు, హెచ్ఎండీఏ, ఫ్యూచర్ సిటీ అథారిటీకి అధికారులను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. జాబితాలో జీహెచ్ఎంసీ కమిషనర్, హెచ్ఎండీఏ సెక్రటరీ, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లతోపాటు, హైదరాబాద్ జిల్లాకు అదనపు కలెక్టర్లు కూడా ఉన్నారు. ప్రభుత్వం వెల్లడించిన జాబితాలో హెచ్ఎండీఏ సెక్రటరీగా ఉపేందర్ రెడ్డిని నియమించగా.. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న ఇలంబర్తిని బదిలీ చేస్తూ ఆయన బాధ్యతలను ఆర్వీ కర్ణన్‌కు అప్పగించింది. ఇలంబర్తిని పట్టణాభివృద్ధి కార్యదర్శిగా నియమించింది. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా హేమంత్ సహదేవ్‌రావు, హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా విద్యాసాగర్‌ను నియమించగా, కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా శశాంక నియమితులయ్యారు. పట్టణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా ఉన్న దానకిశోర్‌ను కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించగా, ఆయన స్థానాన్ని ఇద్దరు ఐఏఎస్ అధికారులతో భర్తీ చేసింది. అయితే ఇటీవలే హెచ్ఎండీఏ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన గంగాధర్‌ను అంతలోనే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

### ఏడాదిలోపే క్యూ కడుతున్న కమిషనర్లు

గ్రేటర్‌లో కీలకమైన శాఖ ఏదైనా ఉందని అంటే అది జీహెచ్ఎంసీ మాత్రమే.. అలాంటి శాఖకు కమిషనర్‌గా పట్టుమని రెండేళ్లు సైతం ఎవరూ ఉండడం లేదు. కమిషనర్ రోనాల్డ్‌రోస్ బల్దియాపై పట్టు సాధించి గాడిలో పెట్టే సమయంలోపే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంధనశాఖకు బదిలీ చేసింది. తర్వాత వచ్చిన కమిషనర్ ఆమ్రపాలి క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యూనల్) ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వంలో రిపోర్టు చేశారు. నాలుగు నెలల్లోపే ఆమె జీహెచ్ఎంసీనే కాదు రాష్ట్రాన్ని వీడాల్సి వచ్చింది. గతేడాది అక్టోబరు 17న జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి బాధ్యతలు తీసుకున్నారు. శాఖలవారీగా పట్టు సాధించి ఆర్థిక, శానిటేషన్ విభాగాన్ని గాడిలో పెడుతూ వచ్చారు. 8 నెలలు గడవముందే ఇలంబర్తిని పురపాలక శాఖ సెక్రటరీ(హెచ్ఎండీఏ లిమిట్)గా బదిలీగా చేశారు.

## పోలీసుల అదుపులో మరో యువకుడు

సిటీబ్యూరో, ఏప్రిల్27(నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి తర్వాత హైదరాబాద్‌లో పాకిస్థానీయులు ఉండకూడదంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పోలీసులు పాకిస్థానీయుల వివరాలపై ఆరా తీస్తున్నారు. పాకిస్థాన్ నుంచి షార్ట్‌టర్మ్ వీసాపై నగరానికి వచ్చిన పౌరులు నలుగురు ఉన్నారు. వీరిలో ఒకరు శనివారం వెళ్లిపోగా ఆదివారం మరో ముగ్గురు కూడా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. సిటీ పోలీసులు నోటీసులు జారీ చేయడంతో వారంతా వేర్వేరుగా విమానంలో దుబాయ్‌కు వెళ్లినట్లుతెలుస్తోంది. షార్ట్ టర్మ్ వీసా ఉన్నవారు ఆదివారం లోపు వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో షార్ట్ టర్మ్ వీసాపై వచ్చిన వారిలో ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. వీరిలో ఓ చిన్నారితో వచ్చిన మహిళ, మరో మహిళ ఆదివారం వెళ్లిపోగా పురుషుడు శనివారం శంషాబాద్ నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. లాంగ్ టర్మ్ వీసాలున్న 11 మంది విషయంలో కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో వారికి నోటీసులు జారీ చేయలేదని వారు తెలిపారు. ఈ క్రమంలో వివిధ రకాల వీసాలపై నగరంలో ఉన్న 208 మంది వివరాలపై ఆరా తీయగా తెరపైకి వచ్చిన మరో అంశం హైదరాబాద్ డిటెన్షన్ సెంటర్‌లో బందీగా ఉన్న మహ్మద్ ఉస్మాన్ ఇక్రమ్ అలియాస్ మహ్మద్ అబ్బాస్ ఇక్రమ్ వ్యవహారం కీలకంగా మారింది. పాకిస్థాన్‌కు చెందిన ఇక్రమ్ విషయంలో ఖైదీలుగా ఉన్నా, కేసులు విచారణలో ఉండి పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారిని వెనక్కు పంపడానికి కేంద్రం అనుమతి లేదని పోలీసులు తెలిపారు. సిటీసైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో డిపోర్టేషన్ సెంటర్‌లో ఇక్రమ్ ఉన్న కారణంగా అతనిని ఇప్పట్లో పాకిస్థాన్‌కు పంపాలా వద్దా అనే విషయంపై క్లారిటీ రావలసి ఉందని సీసీఎస్ పోలీసులు చెప్పారు.

## ఇక్రమ్ ఇంకా ఇక్కడే..!

- ఢిల్లీ వాసినంటూ యువతిని నమ్మించి పెళ్లి ..
- పాకిస్థాన్‌కు పంపాలా వద్దా..
- స్పష్టత లేదంటున్న పోలీసులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి తర్వాత నగరంలో పాకిస్థానీల వివరాల సేకరణలో పోలీసులకు హైదరాబాద్ డిటెన్షన్ సెంటర్‌లో బందీగా ఉన్న మహ్మద్ ఉస్మాన్ ఇక్రమ్ అలియాస్ మహ్మద్ అబ్బాస్ ఇక్రమ్ వ్యవహారం సవాల్‌గా మారింది. పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు ఖైదీలుగా ఉన్నా, కేసులు విచారణలో ఉండి పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారిని వెనక్కి పంపడానికి కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత లేదని పోలీసులు తెలిపారు. సిటీసైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో డిపోర్టేషన్ సెంటర్‌లో ఇక్రమ్ ఉన్న కారణంగా అతడిని ఇప్పట్లో పాకిస్థాన్‌కు పంపాలా వద్దా అనే విషయంపై క్లారిటీ రావలసి ఉందని సీసీఎస్ పోలీసులు చెప్పారు.

### డిటెన్షన్ సెంటర్‌లో ...

నగరానికి చెందిన మహిళ 17 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్‌కు వెళ్లింది. అక్కడ ఇక్రమ్ పరిచయమయ్యాడు. తాను ఢిల్లీకి చెందిన వ్యక్తినని చెప్పి నమ్మించి ఆమెను పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలం తర్వాత ఆ మహిళ దుబాయ్ నుంచి ఇండియాకు వచ్చింది. ఇక్రమ్ కూడా ఆమె తర్వాత భారత్‌కు రావడానికి ప్రయత్నించినా తాను పాకిస్థానీ కావడంతో రాలేక పోయాడు. తర్వాత అక్రమంగా ఇండియాకు చేరుకుని హైదరాబాద్‌కు వచ్చాడు. మొదట్లో ఆమెకు విజిటర్స్ వీసా మీద వచ్చినట్లుగా నమ్మించిన ఇక్రమ్ ఆరునెలల తర్వాత తన బాగోతం బయటపడడంతో ఆమె గొడవ పడి దూరం పెట్టింది. ఇక్రమ్‌కు, అతడి భార్యకు మధ్య గొడవలు కావడం.. ఆమెను వేధించడంతో అతడి భార్య మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత వారిద్దరూ కాంప్రమైజ్ అయ్యారు. మళ్లీ ఇక్రమ్ వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2018లో ఇక్రమ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఇక్రమ్ పాకిస్థానీ అని తెలియడంతో పోలీసులు అతడిని డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. సిటీలో ఉన్న సమయంలోనే ఆధార్‌కార్డ్ కూడా తీసుకున్నట్లు సమాచారం. సాధారణంగా ఏదైనా కేసులో బెయిల్ ఇచ్చి పంపించే అవకాశం ఉంటుంది కానీ ఇక్రమ్ కేసులో అక్రమ చొరబాటుగా చూపి అతడిని సీసీఎస్ పోలీసులు డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. 2023 నుంచి ఇక్రమ్ డిటెన్షన్ సెంటర్‌లోనే ఉన్నారు. ఇక్రమ్ విషయంలో అతను అక్రమంగా ఇండియాకు రావడంతో పోలీసులు అతనిని డిపోర్టేషన్‌కు పంపినప్పుడు పత్రాల్లో తప్పులున్నాయంటూ వారు రిజెక్ట్ చేశారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఇక్రమ్ వ్యవహారాన్ని కేంద్రహోంశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు.



## టీ- వర్క్స్‌లో డిజైన్ వాన్ గార్డు- 2025

కొండాపూర్, ఏప్రిల్ 27 : వోక్సెన్ విశ్వవిద్యాలయం ఔత్సాహిక డిజైనర్ల సృజనాత్మక ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థులు, పరిశ్రమ నాయకులు, డిజైన్ ఔత్సాహికులను ఒకచోట చేర్చి డిజైన్ వాన్ గార్డ్ 2025 నిర్వహించింది. మాదాపూర్ లోని టీ- వర్క్స్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం 'టుమారో బై డిజైన్: నర్చరింగ్ ఫ్యూచర్ క్రియేటర్స్' అనే నేపథ్యంపై దృష్టి సారించి, ఇది ఆవిష్కరణ, పర్యావరణ పరిరక్షణ, అంతర్-విభాగ రూపకల్పన ఆలోచనలను నొక్కి చెప్పేలా సాగింది. ఈ కార్యక్రమంలో మింత్రా డిజైన్ హెడ్ షయక్ సేన్, హైదరాబాద్‌లోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హెడ్ వెంకట్ శ్రీకాంత్, భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖలోని అడ్వాన్స్‌డ్ ల్యాబ్ - డీఆర్‌డీవో డైరెక్టర్ డాక్టర్ వీర బ్రహ్మం హాజరయ్యారు.

## సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

### - రూ. 56 లక్షలు బురిడీ కొట్టించిన చీటర్స్

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు రోజుకో రకంగా మోసానికి తెగబడుతున్నారు. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి స్టాక్స్ ట్రేడింగ్ చేస్తే లాభాలొస్తాయంటూ నమ్మించి రూ. 56.12 లక్షలు సైబర్ దోపిడీకి పాల్పడ్డారు. రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు .. సైనిక్‌పురికి చెందిన ఐటీ ఉద్యోగి. ఈ ఏడాది మార్చి నెలలో ఏ5 అస్క్ ఎక్సుక్లూజివ్ ఇన్వెస్టర్స్ అండ్ 1-1వీ1 వీఐపీ గ్రూప్ ఎక్స్ఛేంజింగ్ అండ్ ప్రమోటింగ్ ట్రేడింగ్ అనే వాట్సాప్ గ్రూప్‌లో నంబర్‌ను యాడ్ చేశారు. అందులో ఉన్న వాళ్లు ఫలానా స్టాక్స్ ఈ రోజు చాలా ట్రెండింగ్‌లో ఉంటాయి, ఐపీఓలు ఇలా వివిధ రకాల స్టాక్స్ గూర్చి చర్చించుకుంటారు. దీంతో బాధితుడు మీరు చేసే ట్రేడింగ్ గూర్చి తెలుసుకోవాలని ఉందంటూ గ్రూప్ అడ్మిన్‌ను అడగడంతో మీకు ట్రేడింగ్ యాప్‌లో అకౌంట్ ఉందా అంటూ అడిగారు, లేదనగానే ముందుకు అస్క్ మిన్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి అందులో హెచ్ఎన్‌డబ్ల్యూ(హై నెట్ వర్త్) అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవాలంటూ సూచిండంతో అడ్మిన్ సూచనలను ఫాలో అయ్యాడు. ట్రేడింగ్‌పై బాధితుడు పెట్టుబడి పెట్టడంతో అందులో లాభాలొచ్చాయి. ఇలా దఫ దఫాలుగా బాధితుడు రూ. 56 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఈ రోజే నిబంధనలు మారాయంటూ నిర్వాహకులు చెప్పడంతో యాప్‌పై అనుమానం వచ్చి రాచకొండ సైబర్‌క్రైమ్‌పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## 'వనజీవి' ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ రవిశంకర్, దశరథ్, సూర్యరావు, లక్ష్మీనారాయణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 27 : ప్రకృతి ప్రేమికుడు, దివంగత పద్మశ్రీ డాక్టర్ వనజీవి రామయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ కుమ్మర శాలివాహన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సంస్మరణ సభలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ వనజీవి రామయ్య జీవితం ఎంతో ఆదర్శవంతమైందన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ట్యాంక్‌బండ్‌పై రామయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఖమ్మం జిల్లాలోని విశ్వవిద్యాలయానికి ఆయన నామకరణం చేయాలన్నారు. జూన్ 1న వనజీవి రామయ్య జయంతిని నిర్వహించాలని, పాఠ్య పుస్తకాల్లో ఆయన జీవిత చరిత్రను చేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వనజీవికి భారత రత్న ఇచ్చే విధంగా కేంద్రానికి సిఫారసు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, సంఘం గౌరవ అధ్యక్షులు కె. దశరథ్, ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, శ్యామ్ కుమార్, కోశాధికారి నిమ్మలూరు శ్రీనివాస్, బాలకృష్ణ, సిల్వేరు వెంకటేశ్, రేపాక రాంబాబు, వీరన్న , చంద్రశేఖర్, బాలామణి, శివానీ, తదితరులు పాల్గొన్నారు.



## 'ఎ' కథా సంపుటి పుస్తకావిష్కరణ

సిటీ బ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): రిటైర్డ్ పోలీస్ అధికారి, రచయిత చిలుకూరి రామ ఉమామహేశ్వర శర్మ రాసిన 'ఎ' కథ సంపుటిని హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఈ పుస్తకంలోని కథలు పాఠకుడిలో ప్రశ్నలు లేవనెత్తి.. ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. వైవిధ్యత, వాస్తవికత, మానవీయ దృక్పథం, మంచి వచనం, చమత్కారం, ఈ కథల ప్రత్యేకత అని చెప్పారు. స్త్రీ, పురుష సంబంధాల గురించి స్వేచ్ఛగా వ్యక్తపరచడం పాఠకులను ఆశ్చర్యపరుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, బాల సాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్, రచయితలు మహ్మద్ ఖదీర్ బాబు, అనిల్ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, రచయిత్రి మానస ఎండ్లూరి, రచయిత్రి కుప్పిలి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## 36 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 36గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. వారం పది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కిన నగరం ద్రోణి ప్రభావంతో కొంత చల్లబడింది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. దీంతో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33.7డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.8డిగ్రీలు, గాలిలో తేమ 57శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## గంజాయి పట్టివేత

మేడ్చల్, ఏప్రిల్ 27 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పనస పండ్ల మాటున ఎవరికి అనుమానం రాకుండా డీసీఎంలో 400 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... డీసీఎం వాహనంలో వైజాగ్ నుంచి మహారాష్ట్రకు మేడ్చల్ మీదుగా తరలిస్తున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని ఆక్సిజన్ పార్కు వద్ద ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన డీసీఎంను తనిఖీ చేయగా గంజాయి పట్టుపడింది. పనస పండ్ల లోడ్ కింద గంజాయి మూటలను ఉంచి, రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. దాని విలువ రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

## 300మంది మందు బాబుల పట్టివేత



సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 300 మంది వాహనదారులను సైబరాబాద్ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. 231మంది ద్విచక్రవాహనదారులే ఉండటం గమనార్హం. కాగా 8మంది త్రి చక్రవాహనదారులు, 58 మంది నాలుగు చక్రాల వాహనదారులు, ముగ్గురు భారీ వాహనదారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షల్లో బీఏసీ రేంజింగ్ 50ఎంజీ/100ఎంఎల్ నుంచి 200ఎంజీ/100ఎంఎల్ మధ్యన 278మందికి, 200ఎంజీ/100ఎంఎల్ నుంచి 300ఎంజీ/100ఎంఎల్ మధ్య 17మందికి, 301ఎంజీ/100ఎంఎల్ నుంచి 500ఎంజీ/100ఎంఎల్ మధ్య 5 మందికి బీఏసీ రేంజ్ ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## వేసవి శిక్షణ శిబిరాలు ఉన్నతికి పునాది

కవాడిగూడ, ఏప్రిల్ 27: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల ఉన్నతికి పునాదులు వేస్తాయని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ భాస్కరరావు అన్నారు. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో రామకృష్ణ మఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంస్కార్-2025 వేసవి శిక్షణ శిబిరాన్ని డాక్టర్ భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై స్వామి బోధమయానందతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఆచరణాత్మకమైన విషయాలను విద్యార్థులు సంస్కార్ శిక్షణ శిబిరంలో గ్రహిస్తారని తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణను పెంపొందించడంలో తల్లిదండ్రుల పాత్రే కీలకంగా నిలుస్తుందన్నారు. విద్య అర్థం, శ్రమకు ఉన్న గౌరవం, విజయం అంటే ఏమిటి అన్న అంశాలను వివరించారు. జీవన నాణ్యత కోసం కుటుంబ బడ్జెట్‌ను ఎలా సిద్ధం చేసుకోవాలో తెలిపారు. కుటుంబ మెరుగుదలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. సంస్కార్ 25 శిక్షణ శిబిరంలో 13 వందల మందికి పైగా విద్యార్థులు శిక్షణ అందుకోనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావుకు స్వామి వివేకానంద జ్ఞాపికను, సాహిత్యాన్ని అందజేసి సత్కరించారు.



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ భాస్కరరావు

## అధికారుల నిర్లక్ష్యానికి యువకుడు బలి



కుల్దీప్ సునీల్ (ఫైల్)

మేడ్చల్, ఏప్రిల్ 27 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ నిండు ప్రాణం బలైంది. తగిన జాగ్రత్తలు తీసుకోని కారణంగా టవర్‌పై మరమ్మతు పనులు చేపడుతున్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్లకోయలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే...నగరంలోని యూసఫ్‌గూడకు చెందిన కుల్దీప్ సునీల్ (33) శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 33 కేవీ విద్యుత్ టవర్ పై ఎక్కి మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ అధికారులు జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు, కార్మికులు ఆరోపిస్తున్నారు. మృతుడు కుల్దీప్ సునీల్‌కు వివాహం నిశ్చమైంది. ఈ తరుణంలో ఆయన మృతి చెందడం కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచింది.

## దాడులను నిలిపివేయాలి





కర్రెగుట్ట ప్రాంతంలో మావోయిస్టులపై జరుగుతున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని.. మావోయిస్టులతో శాంతి చర్చలను జరపాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమెక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ జాతిని హననం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు.

## నీటి లీకేజీకి అడుకట్ట

సిటీబ్యూరో, ఏప్రిల్27,(నమస్తే తెలంగాణ): జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నంబర్-4 రెడ్ హిల్స్ పరిధిలోని మొజాంజాహి మార్కెట్‌లో నీటి లీకేజీని అధికారులు అరికట్టారు. మొజాంజాహి మార్కెట్ సమీపంలో ఉన్న 350 డయా ఎంఎం పైప్ లైన్ సరఫరా సమయంలోలో నీటి లీకేజీ ఏర్పడగా మలకుంట రోడ్, రిసాలా అబ్దుల్లా, ఒస్మాన్‌గంజ్, శంకర్‌బాగ్, టాప్ ఖానా ప్రాంతాల్లో సుమారు 700 ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోకుండా లీకేజీని అరికట్టారు.

## ఉగ్రదాడి మృతులకు నివాళి..



పహల్గాం ఉగ్ర దాడిలో ప్రాణాలుకోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ నిహారిక ఎక్సోటికా వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..ఉగ్రవాదం మనుషులను చీల్చే ప్రయత్నం చేస్తుందని, దానికి విరుద్ధంగా శాంతి, ప్రేమ, మానవత విలువలు కలిగి ఉండాలన్నారు. - సిటీబ్యూరో





జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని కోరారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**GOLD FINANCE**



★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-329239

**OLD AGE HOME**

★వృద్ధులు, NRI's, లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్. ఉప్పల్ & చీర్యాల్ 'X' రోడ్, మీన్స్ హోమ్స్. భోజనం, వసతి. 7981467036, 9391039990, 6281125552. NT-336465

**TOURS & TRAVELS**

★మహాదేవ టూర్స్: అమరనాథ్ + నవదేవి యాత్ర 28 జూన్, ఖామాఖ్య 6 జూన్, కర్ణాటక 21 జూస్, Ac రైలు, వాహనము, రూములు, భోజనములతో @ 9676637578 NT-325311

**HOUSE FOR SALE**



★రూ. 47,00,000/-లకే ఇండిపెండెంట్ హౌస్ HMDA, RERA, విజయవాడ హైవే & సాగర్ హైవే, ఇబ్రహీంపట్నం ఫ్యూచర్ సిటీ, బ్యాంక్ లోన్. Ph: 6303493745. NT-325253

**HMDA PLOTS**

★HMDA, RERA అప్రూవ్డ్ ORR Exit No. 10, బండరావిరాల (తారామతిపేట్) 100 Ft. Road Facingలో Premium Villa Plots, స్పాట్ రిజి||, బ్యాంక్ లోన్స్. 8464919899. NT-336402

**LEASE/SALE**

★New Godown 1800 Sft. with 2 Floor Metal Fabrication with Racks for Sale @ as is where is / Lease @ Gajularamaram. 9000240480 / 7207888295. NT-336482

**WANTED**



★ప్రముఖ కంపెనీలో పని చేయుటకు "సేల్స్ మేనేజర్లు" మరియు "Accountants" (అకౌంటెంట్లు) కావలెను. Qualification: Degree / MBA, Salary: 20,000 + Incentives + Petrol Allowance. Contact: 8096403602. NT-330861

**WANTED**

★ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, డోర్ 2 డోర్ యువతీ/యువకులు కావలెను. జీతం: 25 వేలు. ఫోన్: 7670867600. NT-325301

★HMDA & DTCP & అపార్ట్‌మెంట్స్ & ఓపెన్ ప్లాట్స్ సేల్స్ చేయుటకు అనుభవం కలిగిన SMMS/AGMS/DGMS/GMS కావలెను. 7981217883. NT-325306

★ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో చేరండి... మంచి ఆదాయం సంపాదించుకునే సువర్ణ అవకాశం. అన్నిరంగాలవారు, గృహిణులు, రిటైర్డ్ ఉద్యోగులు Full/Part Time. Ph: 9866607469. NT-336351

★అర్జెంటుగా స్త్రీ/పురుషులు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం కలదు @ L.B.నగర్ & ECIL. సంప్రదించండి: 8639570385, 9392663777, 9246663777. NT-325308

**CHANGE OF NAME**

★I, CHINTHA SUJEEVANA W/o Chintha Venugopal R/o Flat No 408, AV Chandana Heights, Medipally, Peerzadiguda, Medchal - Malkajgiri District-98, Telangana. hereby change my name from SUJEEVANA KUMARI VEMANA to CHINTHA SUJEEVANA for All future Purposes, NT-329144

**LOST**

★I, Chekuri Geetha Rani, W/o Chekuri Sudershan Address: 6-296/B/50/A Ragavendra Colony, Suchitracircle, Hyderabad. While i was travelling Balangar to Suchitra i lost Land registration Deed document no 15315/2006. Sanga Reddy SRO, If found plz call Ph: 8688382012 NT-336357

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) | ప్రతి అదనపు లైనుకు రూ.75/- | Cell: 9848077857

| | | |
|---|---|---|
| దిల్‌సుఖ్‌నగర్ : 9182777805 | ఉప్పల్, తార్నాక : 9182777209 | అమీర్‌పేట్, మెహదీపట్నం : 9182777126 |
| మల్కాజిగిరి, E.C.I.L : 9182777125 | L.B.నగర్, వనస్థలిపురం : 9182777808 | B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204 |
| | | కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205 |